క్లుప్తంగా

108లో ప్రసవం..

తల్లీబిడ్డ క్షేమం



శిశువును కుటుంబీకులకు అందజేస్తున్న 108 ఉద్యోగి

కడ్తాల్: మండల పరిధి ముద్వీన్ గ్రామానికి చెందిన శ్రీశైలం భార్య లావణ్యకు శుక్రవారం ఉదయం ఆరుగంటలకు పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో కుటుంబీకులు 108లో ఆమెను కాన్పుకోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. అప్రమత్తమైన 108 సిబ్బంది, సదరు గర్భిణీకి సాధారణ కాన్పు చేయగా.. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. సకాలంలో సిబ్బంది స్పందించడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ కల్యాణ్, పైలట్ శ్రీనివాస్‌రెడ్డిలను అభినందించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాడ్గుల: అభివృద్ధి పనుల కోసం రూ.7.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ మల్లురవి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండల్‌రెడ్డి, యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ రాములు, జంగయ్యగౌడ్, శరథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణకు టీకా



పశువులకు టీకా ఇస్తున్న డాక్టర్ అగ్నివేశ్

ఆమనగల్లు: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గాలికుంటు నివారణకు టీకా వేస్తున్నామని, రైతులు తమ పశువులకు టీకాలు ఇప్పించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ చింతోజు అగ్నివేశ్ సూచించారు. శుక్రవారం మండల పరిధి సింగంపల్లి గ్రామంలో 168 ఆవులు, 24 పాడి పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది సులేమాన్, యాదయ్య, పాలాక్ష, బురానొద్దీన్, గోపాల మిత్రలు హరీశ్, రమేశ్, ప్రకాశ్‌లు పాల్గొన్నారు.

పాఠశాల మరమ్మతులకు విరాళం



దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తలకొండపల్లి: మండల పరిధి చంద్రధన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల మరమ్మతుల కోసం గ్రామానికి చెందిన ఏన్నెడ్ల రాజేందర్ రెడ్డి రూ.30 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గురువారం ఉపాధ్యాయులు దాతను ఘనంగా సన్మానించారు. అనంతరం దాత రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు ఇమిడి ఉంటుందని, పాఠశాలల బాగు కోసం, ప్రతి ఒక్కరూ భాగస్వాములై పని చేద్దామని పిలుపునిచ్చారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

కేఎల్‌ఆర్‌కు గ్రామస్తుల వినతి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధి మంఖాల్ నుంచి హర్షగూడ గ్రామం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని హర్షగూడ గ్రామస్తులు కోరారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు సమస్య పట్ల కేఎల్‌ఆర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభించి, పూర్తియ్యేలా చూస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు రవినాయక్, రాజు నాయక్, పెండాల కుమార్, సరోజ, నవీన్, అజయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- అస్తవ్యస్తంగా మారిన గ్రామాలు
- విజృంభిస్తున్న దోమలు, ఈగలు
- ప్రజలను పట్టిపీడిస్తున్న విషజ్వరాలు
- పట్టించుకోని అధికారులు

మంచాల: ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. పట్టించుకునే వారు లేకపోవడంతో సమస్య తీవ్రమై ప్రజలకు ఇబ్బందిగా మారింది. అపరిశుభ్రత కారణంగా దోమలు, ఈగలు విజృంభించి, ప్రజానికాన్ని విషజ్వరాల బారిన పడేలా చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పల్లెల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని, మురుగు కాలువలు ముందుకు సాగని దుస్థితి కలిగిందని, దుర్వాసన భరించేకపోతున్నామని ప్రాంత వాసులు వాపోతున్నారు.

ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం..

మంచాల మండలం నోముల గ్రామంలో ఎస్సీ కాలనీ నుంచి గ్రామంలోకి వచ్చే రోడ్డు పక్కనే మురుగు నీరు నిలిచి, దుర్వాసన వెదజల్లుతోంది. జాపాల గ్రామం 8వ వార్డులో అండర్ డ్రైనేజీ మరమ్మతులకు గురైంది. గిరిజన తండాల్లో ఇళ్లమధ్య, రోడ్ల పక్కన చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. లోయపల్లి గ్రామంలో ఏడు, తొమ్మిదో వార్డుల్లో మురుగు సమస్య ఏళ్ల తరబడి వేధిస్తోంది. ఇలా నివాసాల మధ్య, రహదారి పక్కన పేరుకుపోయిన అపరిశుభ్రతతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దోమలు, ఈగలు పెరిగాయని, కరెంట్ పోతే ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని పేర్కొంటున్నారు. విష జ్వరాల బారిన పడుతున్నామన్నారు. గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి, పారిశుద్ధ్య సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



నోములలో రోడ్డు పక్కనే నిలిచిన మురుగు నీరు



జాపాలలో నడిరోడ్డుపై ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

సమస్య పరిష్కరించాలి



గ్రామాల్లో అపరిశుభ్రత పెరిగిపోయింది. పేరుకుపోయిన చెత్తకుప్పలు, ముందుకు సాగని మురుగు కాలువలతో ఇబ్బంది పడుతున్నాము. ఈగలు, దోమల కారణంగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్రజారోగ్యం దృష్టిలో ఉచుకుని, సంబంధిత అధికారులు పారిశుద్ధ్య సమస్యకు పరిష్కారం చూపాలి.

– వీరేశం ముదిరాజ్, నోముల

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించాం. సమస్యలను పరిష్కరించడమే కాకుండా.. బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం. మురుగు కాల్వలను శుభ్రం చేయించి, ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలను తొలగింపచేస్తాం.

– బాల శంకర్, ఎంపీడీఓ, మంచాల

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

మంచాల: పత్తి సాగులో రైతులు మెలకువలు తప్పనిసరిగా నేర్చుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త ఎ.అమృత అన్నారు. కృషి విజ్ఞాన్ కేంద్ర పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధి చిత్తాపూర్‌లో ఆమె పత్తి పంటను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే విధంగా సాగులో రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కూలీల ఇబ్బంది లేకుండా ఆధునిక పద్ధతిలో సాగు చేసి లాభాలు పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్ర వేత్తలు డాక్టర్ సుదీర్, డాక్టర్ దిలీప్, ఎన్‌జీఓ సంఘాల ప్రతినిధులు కృష్ణ, హరికృష్ణ, మాజీ సర్పంచ్ నాగరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త తదితరులు



అబ్దుల్లాపూర్‌మెట్: సభ్యత్వ నమోదు చేయిస్తున్న, పార్టీ శ్రేణులు

బీజేపీతోనే దేశ ప్రగతి

- సభ్యత్వ నమోదులో కమలనాథులు

తలకొండపల్లి: బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవిగౌడ్ అన్నారు. మండల పరిధి చీపునుంతల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి సభ్యత్వం నమోదు చేయించారు. అనంతరం రవి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ.. సభ్యత్వ నమోదును విస్తృతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ అభివృద్ధి, సిద్ధాంతాల కోసం పాటుపడే వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీమోర్చా మండల అధ్యక్షుడు మల్లేశ్, పరమేష్, రమేష్, చంద్రమౌళి, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.



తలకొండపల్లిలో..

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొత్త అశోక్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధి గౌరెల్లి గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి సభ్యత్వాలను నమోదు చేయించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, నాయకులు పాపయ్యగౌడ్, మోహన్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, మధు, రమేష్, సాయిగౌడ్‌లతో పాటు పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసేవే లయన్స్ క్లబ్ ధ్యేయం

కడ్తాల్: పేద ప్రజలకు సేవలందించడమే తమ ధ్యేయమని లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేందర్‌కుమార్‌రెడ్డి అన్నారు. రంగనాయకమ్మ వర్ధంతిని పురస్కరించుకుని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన వీల్స్ ఆన్ మీల్స్ అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం లయన్ ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మహేందర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 39 ఏళ్లుగా క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలను ప్రశంసించారు. సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి మహేశ్, జిల్లా కోఆర్డినేటర్ రాంరెడ్డి, చైర్మన్ జూలూరి రమేశ్, క్లబ్ సభ్యులు రాజేందర్‌యాదవ్, వేణుగోపాల్, అంజయ్య, శ్రీను, వెంకటేశ్, గోవర్ధన్‌రెడ్డి, కుమార్, లక్ష్మయ్య, పీఆర్‌ఓ పాషా తదితరులు ఉన్నారు.



అన్నదానం ప్రారంభించిన లయన్ గవర్నర్, సభ్యులు

కడ్తాల్‌లో డీసీసీబీ శాఖ ఏర్పాటు చేయండి

డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శాఖను ఏర్పాటు చేయాలని ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర సహకార బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావ్‌ను డీసీసీబీ మహబూబ్‌నగర్ జిల్లా చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్‌గుప్తలు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు లోబడి రాష్ట్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో, రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 20 శాఖలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధి కడ్తాల్ మండల కేంద్రంలో శాఖను ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనికి రవీందర్‌రావ్ సానుకూలంగా స్పందించినట్లు గుప్తా తెలిపారు.



రవీందర్‌రావ్‌ను సత్కరిస్తున్న వెంకటేశ్‌గుప్తా

విద్యతోనే కుటుంబ ఆర్థిక వృద్ధి

గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు



కూరగాయలు కొనుగోలు చేస్తున్న సీఐ

యాచారం: అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఎంత కష్టమైనా పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. పీఎస్ పరిధి తాడిపర్తి, కుర్మిద్ద, నానక్ నగర్, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. రైతులు, వ్యవసాయ కూలీలను కలిసి మాట్లాడారు. మీ కష్టం పిల్లలకు రానియ్యవద్దని, ఎంత కష్టమైనా వారికి ఉన్నత చదువులు చెప్పించాలని సూచించారు. అనంతరం వారు ఉద్యోగాలు చేస్తూ.. ఉన్నత స్థితిలో రాణిస్తే.. కుటుంబ ఆర్థిక పరిస్థితి గాడిన పడుతుందని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో స్థిరపడాలని స్పష్టంచేశారు. తాడిపర్తి గ్రామంలో మహిళల వద్ద ఆకుకూరలు, కూరగాయలు కొనుగోలు చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి

పహాడీషరీఫ్: నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టామని మహేశ్వరం డివిజన్ ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి అన్నారు. సీఐ గురువారెడ్డితో కలిసి ఆయన ఠాణా పరిధిలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నగర శివారులో ఉన్న డివిజన్ పరిధిలో ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా చోరీలకు తావులేకుండా రౌండ్ ది క్లాక్ పెట్రోలింగ్‌ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇతర ప్రాంతాల నుంచి చోరీ చేసిన వాహనాలతో వచ్చే నేరస్తులను గుర్తించేందుకు తనిఖీలు చేపట్టామని తెలిపారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్ మార్చండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

- తహసీల్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

కడ్తాల్: పంట పొలాల మీదుగా 765 కేవీ విద్యుత్ హైటెన్షన్ లైన్ తీసేందుకు వేసిన అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని మండల ప్రజలు, రైతులు, నాయకులు డిమాండ్ చేశారు. అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ.. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మండల కేంద్రానికి సమీపంలో 66 సర్వే నంబర్లో సుమారు 150 మంది చిన్నసన్నకారు రైతులకు చెందిన పొలాల మీదుగా విద్యుత్ హైటెన్షన్ లైన్ వేసేందుకు ట్రాన్స్‌కో అధికారులు మార్కింగ్ వేశారని తెలిపారు. దీని వలన రైతు కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని, భవిష్యత్తు అవసరాలకు అనేక ఇబ్బందులు తలెత్తనున్నాయని పేర్కొన్నారు. వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతానికి నష్టమేనని వెల్లడించారు. ఇక్కడి రైతుల, ప్రజానీకం సమస్యలను దృష్టిలో ఉంచుకుని, మండల కేంద్రానికి 5 కిలో మీటర్ల దూరంలో అగ్రికల్చర్ జోన్, ప్రభుత్వ భూములు ఉన్నాయని, హైటెన్షన్ అలైన్ మెంట్‌ను అక్కడికి మార్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, జంగారెడ్డి, సేవలాల్ సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్ నాయక్, రైతులు రాములు యాదవ్, కేశవులు, వెంకటేశ్, పెంటారెడ్డి, జంగారెడ్డి, గణేశ్, శ్రీనివాస్, మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, శ్రీరాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

కడ్తాల్: విద్యారంగంతో పాటు, ఉపాధ్యాయ సమస్యలపై తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నిరంతరం ఉద్యమిస్తుందని సంఘం జిల్లా మహిళా ప్రముఖ్ సుమరంజిత అన్నారు. శుక్రవారం మండల పరిధి పాఠశాలల్లో టీపీయూఎస్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమరంజిత మాట్లాడుతూ.. పెండింగ్ డీఏలను చెల్లించి, పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ అయిన వారి జులై నెల వేతనం వెంటనే చెల్లించాలని కోరారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించి, మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం నమోదు చేస్తున్న టీపీయూఎస్ నాయకులు

ప్రజాపాలన ఓర్వని బీఆర్ఎస్

- అసత్య ఆరోపణలతో పబ్బంగడుపుతున్న గులాబీ దండు
- కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహా

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వాన్ని చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఆమనగల్లు అధ్యక్షుడు యాట నర్సింహులు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసి పునరుజ్జీవానికి చర్యలు చేపడుతుంటే.. అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలు తిరస్కరించడంతో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్.. ప్రజాపాలనను చూసి, కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. మూసి ప్రక్షాళనతో నష్టపోయే ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకుంటుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని వెల్లడించారు. సమావేశంలో పార్టీ కడ్తాల్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, నాయకులు జగన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఊరుకొండపేట్ బస్‌ను పునరుద్ధరించాలి

తలకొండపల్లి: బస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ.. గురువారం మండల పరిధి జూలపల్లి గ్రామస్తులు ధర్నా చేశారు. మహేశ్వరం డిపోనకు చెందిన ఆర్టీసీ బస్ నగరం నుంచి జూలపల్లి, చంద్రధనల మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఊరుకొండపేట్‌కు వెళ్తుంది. కొన్ని కారణాల వలన ఆ సర్వీస్ రద్దయింది. దీంతో గ్రామస్తులు రవాణా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజారవాణాను దృష్టిలో ఉంచుకుని గ్రామానికి బస్సును నడపాలని కోరారు. అనిల్ కుమార్, వెంకటేశ్, ముని, రాఘవేందర్, గులానంద్, విజేందర్, వల్లభ దాస్, యాదయ్య, శ్రీను, నరసింహ, చంటి, బాలయ్య, నరేష్, కాశయ్య, శేఖర్, కార్తీక్, శివగౌడ్ ఉన్నారు.



ధర్నా చేస్తున్న జూలపల్లి గ్రామస్తులు

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఇబ్రహీంపట్నం: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నేతలు శివకృష్ణ, పి.జగదీశ్, మహేందర్‌లు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.7500 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. దీని కారణంగా విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు ఇంజినీరింగ్, డిగ్రీలు పూర్తి చేసి, సర్టిఫికెట్లు లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం వెంటనే పెండిగ్ బిల్లులను చెల్లించాలని కోరారు.

కొలిక్కిరాని ఇందిరమ్మ కమిటీలు

- రాజకీయ నాయకుల జోక్యంతో తీవ్ర జాప్యం
- అదనపు సభ్యుల పేర్లతో అధికారుల తంటా
- జాబితా సిద్ధం చేసేందుకు కుస్తీ

ఇబ్రహీంపట్నం: పేదోడి సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఇళ్ల నిర్మాణ పథకానికి ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో జాబితాల తయారీలో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. గ్రామ స్థాయిలో కమిటీలు ఇంకా ఒక కొలిక్కి రావడం లేదు. ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ పరిధిలో 14 గ్రామ పంచాయతీలున్నాయి. సర్పంచ్ పదవి కాలం ముగిసినందున గ్రామ ప్రత్యేక అధికారి ఇందిరమ్మ కమిటీ చైర్మన్‌గా, జీపీ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీలో మరో ఐదుగురు సభ్యులుంటారు. అందులో స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలు, ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాల నుంచి ఒక్కొక్కరిని సభ్యులుగా నియమిస్తారు.



ఎంపీడీఓ కార్యాలయంలో తుది జాబిత సిద్ధం చేస్తున్న అధికారులు

అదనపు సభ్యులతో..

జాబితా తయారీలో రాజకీయ నాయకుల జోక్యం వలన జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో ఐదుగురు సభ్యులకు గాను.. అదనంగా మరో ఇద్దరు ముగ్గురిని చేర్చడంతో సమస్య వస్తోంది. ఈ రకంగా రూపొందించిన జాబితాను ఉన్నతాధికారులకు పంపగా, వారు తిరిగి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రామాల లిస్ట్ నుంచి ఎవరిని తొలగించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు సూచనల మేరకు ఐదుగురినే సభ్యులుగా నియమించేందుకు మరోసారి కసరత్తు మొదలు పెట్టారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీల జాబితాలు గత గురువారం లోపు పూర్తవుతాయని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడి ప్రకటించినా ఆచరణలో సాధ్యం కావడం లేదు.

లబ్ధిదారుల ఎంపికలో కమిటీలు కీలకం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఈ కమిటీ సభ్యులు కీలకం కానున్నారు. ఇళ్ల కేటాయింపుతో పాటు నిర్మాణం పూర్తయ్యేవరకు కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తుంటారు. దీంతో ఈ కమిటీలో స్థానం దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారని, అందుకే జాబితా తయారీలో జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సభ్యుల ఎంపికలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తమ వంతు తుది కసరత్తు చేస్తున్నారు.